కథానిక

# భక్తియోగం

కాలజ్ఞానం సుబ్బారావు

మా ఊరికంతా ముత్యాలయ్య శ్రేష్ఠిగారు వర్తకబృందంలో పైచెయ్యనే చెప్పాలి. అందుకు తగ్గట్టే ఆయనంటే మహాభిమానం మా ఊరి తాశీల్దారు వారికీని. ముత్యాలయ్య శెట్టిగారు అటు బట్టల కొట్టు-యిటు జనరల్ స్టోర్సుల వల్ల ఊరివాళ్లని ఉద్ధరించడమే కాక రేషన్ షాపు నడపడానికికూడా పర్మిషన్ పొందారు. ఏ ముహూర్తాన ప్రారంభించారో గాని షాపుని, ఆయనగారి కీర్తి ఊరంతా-చుట్టూ ఉండే పల్లెలకంతటికీకూడా వ్యాపించిపోయింది. ఇందుకు ముఖ్యంగా కారణం ఆయనగారి సాయిబాబా మీది భక్తి విశేషం! ఊళ్లో కొన్నాళ్లుగా జరిగే బాబా భజనలేమి-ధూపదీప నైవేద్యాలేమి-ఆహా! ఊరివారికి శెట్టిగారొక పురంధరదాసుగనో, భక్త తుకారాంగానో అగుపడ్డారంటే ఆశ్చర్యమేమీ లేదు. శెట్టిగారు పై ఆఫీసర్లందరికీ కావలసినవారైపోయారు. తాశీల్దారు వారు శెట్టిగారు జరిపే భజనలకి హాజరు కావడం పరిపాటైపోయింది. సాయిబాబాకని తెచ్చిన పుష్పాలూ, పండ్లూ, పాలూ వగైరాలన్నిటిలో కూడా పూజానంతరం తాశీల్దారువారికి కొంత పాలు యివ్వటం-వారు నవ్వుతూ సాయిబాబా కృపవల్ల, ధర్మమార్గాన వ్యాపారం చేసే ముత్యాలయ్య శెట్టిగారి యింట్లో త్వరలో ముత్యాలెక్కడ చూసినా దొర్లుతుండాలి, అని అక్కడి భక్తుల కందరికీ వినపడేలాగు ప్రార్థించడం-అందుకు శ్రేష్ఠిగారు, "తమబోటివాళ్ల ఆమాత్రం చల్లనిచూపు చూస్తే వ్యాపారానికేం లోటుంటుంది? పైగా సాయిదేవుని ప్రభావంకూడా ఉంటే..." అంటూ అంతటితో మాటల్ని మింగడంకూడా క్రమంగా జరుగుతూండేది. కొన్నాళ్ళకి శెట్టిగారు రాజకీయాల్లోకూడా తమ అభిప్రాయాల్ని వెళ్ళబుచ్చడం చూస్తే ఊళ్ళో అందరూ శెట్టిగారు దైవభక్తే కాకుండా దేశభక్తి కూడా కలిగిఉన్నారని బాగా తెలిసికున్నారు.

భజన మందిరంలో (ఆయనగారి ఇంట్లోనే ఓ హాలు) శెట్టిగారు గంధం రాచుకొని, విళ్ళ ధోవతి కట్టుకొని, పూలహారం వేసికొని సాయి విగ్రహంముందు చేతుల్లో తాళాలతో గొంతెత్తి కీర్తనల్ని పాడుతుంటే చుట్టూ భక్తులంతా పదపదాన్ని పరవశులై పాడేవారు. ఓగంట అయ్యేప్పటికి భజన 'క్లయిమేక్సు' రీచవడంతో అక్కడి ప్రతివారి కండ్లకు సాయి విగ్రహంతప్ప ఇంకేమీ గోచరించడం లేదనే చూచేవాళ్ళు అనుకుంటారు. భజన ముగియడంతో శెట్టిగారు లేచి భక్తులనుద్దేశించి హితోపదేశం చెయ్యటం, ఆపై కర్పూరహారతి జరగడం-నైవేద్య సమర్పణ, భక్తులకి వాటిని పంచడం జరగడంతో అందరూ ఎవరి ఇండ్లకు వాళ్ళు తరలేవారు. అందుపై శెట్టిగారు ఆరోజు రాత్రి ఉపవాసం చెయ్యడం-మరునాడు తెల్లవారగట్ల స్నానాంతరం ఫలహారం, 'సాయూర్పణమస్తు' అని చెప్పి సేవించడం జరుగుతుండేది ... ఆరు మాసాలు గడిచాయి యీ విధంగానే! రేషన్ బియ్యమూ, చక్కెరా అన్నాళ్ళూ సమయానికి రావడం, అందరికీ వాళ్ళ వాటాలు సరిగ్గా ముట్టడం కొనసాగింది. శెట్టిగారి షాపుకి ఆనాడు తమకార్డుని మార్చుకొని వాడు లేకపోయ్యాడు.

కాని ఉన్నట్టుండి అవాంతరమొచ్చింది. రేషన్ బియ్యం కిరసనాయిల్ కంపుకొట్టడం, చక్కెర కోటా రావడం లేకపోవడం - జరగడం మొదలెట్టినై! తరచూ శెట్టిగారు ఊళ్ళోనుంచి ఎక్కడికో (షిర్డీకని వినికిడి లెండి!) వెళ్ళి వచ్చేవారు. భజనల హంగామా కొంత తగ్గినట్టుంది. కారణం ఏమంటే శెట్టిగారికి ఒంట్లో బాగుండ లేదని ఎవ్వరో చెప్పగా విన్నాను. అందరూ బియ్యాన్ని గూర్చి అడిగితే "వచ్చిందే అద"ని అక్కడి సేల్సుమన్ జవాబు! విధిలా! అదీ లేకుంటే ఆ అరకడుపూ నింపుకోవడం దుర్లభమని ఊరివాళ్ళంతా దాన్నే కొనుక్కునేవాళ్ళు. గోధు

మలు కూడా రావడం మానేశాయి. ఒక్కొక్క వారం చక్కెర కోటా రావడం ఆగిపొయ్యేది. "ఈవారం చక్కెర స్టాకు రాలే"దని బోర్డు కట్టేసేవాళ్ళు కొట్టులో. ఇంత జరిగినా అదేమి కర్మమోగానీ జనమంతా శెట్టిగారిమీద మహాదభిమానాన్ని, మనఃపూర్వకమైన నమ్మకాన్ని వెళ్ళబుచ్చేవారు! ప్రభుత్వాన్ని తిట్టినా పనికిరానివాళ్ళు! అనుకుంటుండగానే తాశీల్దారు వారికి 'బదిలీ' అయ్యిందని ఊరంతా పొక్కిపోయింది. శెట్టిగారి ఆప్తమిత్రులంతా కూడ అందుకు విచార పడ్డారంటే యిక ముత్యాలయ్యగారి పరితాపాన్ని ఎలా వర్ణించేది? ఆనాడే శెట్టిగారు తాశీల్దారు వారికి ఓ టీపార్టీ యివ్వటమూ - ఆయనగారు శెట్టిగారి దాతృత్వాన్నీ, ధర్మతత్వాన్నీ పొగడుతూ తమ అభిప్రాయాల్ని తెలియపర్చడం జరిగినై! మరునాడు పేపర్లలో ఫొటోసైతంగా యీ వీడ్కోలు సన్మాన వృత్తాంతం పడటం ముత్యాలయ్యగారికీ తాశీల్దారు వారికీ ఉన్న యీ స్నేహబంధం వాడవాడలా వ్యాపింపచేసింది. ఇంతకూ వీరిద్దరికీ యింత సన్నిహిత బాంధవ్యం కలగడానికి ఏదో 'కిటుకు' ఉండితీరాలి... శెట్టిగార్ని ఆ మాత్రం శంకిస్తే పాపం చుట్టుకుంటుంది! అంతటి భక్తశిఖామణులని ఊరకే సాటివాళ్ళు సందేహిస్తే ఆయనకు వచ్చే నష్టమేమీ లేదు. నన్నూ లోకం నమ్ముతుంది? అట్లా నమ్మితే సాయీ సేవా ఫలితం శెట్టిగారి కింకేరితి చేకూరిందన్నమాట? ఈ మాత్రం మాటలకే ధర్మస్వరూపులైన శెట్టిగారికి నేనెంతో అపచారం చేసాను. శివ శివ! సాయి సాయీ! యీ దీనుడి బుర్ర కటువంటి పాపంపు భావాలెందుకు రానిస్తావ్?

తాశీల్దారు వారి నిష్క్రమణతో భజనల సర్వస్వం తగ్గిందనే అనాలి. శెట్టిగారు వారానికి రెండు రోజులు ఊళ్ళోవుంటే ఎక్కువ. భజన మాత్రం శెట్టిగారి గైరాజరులోకూడ మిగతా సాయీ భక్తజన మండలి సభ్యులతో నిర్విఘ్నంగా జరుగుతూనేవుంది. బియ్యం కిరసిన్ కంపూ; చక్కెర కొరతా నానాటికీ ఎక్కువయాయి. ఇప్పటికి జనంలో గుసగుసలు బయలుదేరినై! ఐనా పబ్లిక్ గా శెట్టిగార్ని వేలుపెట్టి చూపేంతటి ధైర్యం ఎవ్వరికీ లేకపోయింది. సాయిబాబా శెట్టిగారి రెస్క్యూకివస్తే? తమగతేంకావాలి? అందుకే ఎంతఅనుమానమున్నా వచ్చేసరుకేఅరకంకాబోలు అనుకునేవాళ్లు. కాస్త తెలివి వాడొచ్చి "బియ్యం మంచిరకం రాదాండీ?" అని అడిగితే, "చాల్లేవయ్యా! యీ మాత్రం యిచ్చేందుకే తృప్తిపడాలి తెలుసా? ఎక్కువ పండిస్తేగా మీ రైతులు? లేకుంటే తక్కువైనా తినాలి. అంతే వచ్చే సరుకు!" అని శెట్టిగారి భృత్యులు గర్జిస్తే చెవులు ఝాడించుకొని వచ్చేవాడు. ఈ తతంగం కనిపెట్టి లోపటి పురాణం బయటికి లాగాలని నాలో మాత్రం ఏదో తెలీని ఓ తీవ్రశక్తి ప్రోద్బలిస్తూ వచ్చింది. ఆఁ! మంచి బియ్యం శెట్టి అంగడిలోనే తెచ్చుకొనే ఉద్యోగస్థుల్ని నేను కండ్లారా చూస్తోంటే? లోగుట్టు పెరుమాళ్ళ కెరుక! నా యీప్సితం యీడేరే రోజొచ్చింది. ఓనాడు ఏదో విశేషమట! సాయిబాబా భజన చాల జోరుగా జరుగుతుందని ముత్యాలయ్యగారు ఆహ్వాన పత్రికలు అచ్చువేయించి అందరికీ పంపారు. ఊళ్ళో వాళ్ళకి, ఉన్నట్టుండి మధ్యలో భజనల్ని ఏమరిన శ్రీ ముత్యాలయ్యగారు ఆనాడమితోత్సాహంతో ప్రారంభంలో ఉండిన దానికి రెట్టింపు భక్తితో ఇదంతా చెయ్యడం ఏవిధంగా అనుమానం కలిగించలేదు సరికదా పైపెచ్చు వాళ్లంతా మళ్లీ శ్రేష్ఠిగారిని స్తోత్రం మొదలెట్టారు "భక్తులలో ఉత్తముడు"—'కలికాలంలో సాక్షాత్ రామదాసు వంటివాడని." ఏం చెయ్యడం? లోకుల్ని కాకులనడం ఆనాటికి నాకు బాగా అర్థమయింది. లేకుంటే బియ్యం, చక్కెర, సంగతిలో జరిగే మోసపురాణం సంగతే వాళ్ళు మరుస్తారా? భజనమందిరంలో శ్రీ శ్రేష్ఠిగారి యింట్లో తాశీల్దారువారు (మాజీ లెండి!) అగుపడ్డం నాకాశ్చర్యజనకమయింది. భజన లారంభమైనాయి. తాశీల్దారు వారి కాహ్వానం పోయుంటుంది బహుశా! వారికి లేకుండానా! నా పిచ్చి గాని! భజన అందరినీ మైమరపింప చేసింది. శెట్టిగారి దైవ చింతనావ్రతం చూస్తే నిజంగా బొందెతో కైలాసం పోతారనే అందరూ విశ్వసించారు.

మధ్యలో ఎవడో వచ్చి శెట్టిగారికీ, వారి ప్రక్కనుండే తాశీల్దారు వారికీ చెవిలో ఏదో

తోదాడు. భజనలో కండ్లు మూసుకున్న భక్తజనం చూడలేదు! నేనుమాత్రం గమనించాను. శ్రేష్ఠిగారు లేచి గుట్టుగా తాశీల్దారుతో సహా భజన పైస్థాయిలో ఉండగా దాటుకొన్నారు. కొంతసేపటికే ఓ సి.ఐ.డి, కొందరు పోలీసులతో రావడం-సాయిబాబా భజన ఆగడం-విగ్రహం తొలగించి వెనుక గదిలో వుండే చక్కెర మూటలు, బియ్యం మూటలు, గోధుమ మూటలు బయటికి లాగడం ఒక్క త్రుటిలో జరిగాయి. శ్రేష్ఠిగారి కుడి ఎడమ భుజాలు జారుకున్నాయి! అబ్బ! గోధుమ మూటలు పురుగులు పట్టినయి! బియ్యం పురుగులపాల పడింది. మూటలన్నీ లారీలో ఎక్కించి వాళ్లు వెళ్లి పోయ్యారు. తర్వాత అక్కడ ఓ పిట్టలేకుండా అందరం వెళ్లిపోయ్యాం. శెట్టిగారి కని వెదుకులాడితే ఆ రాత్రి దొరకలేదట! కాని మరుదినమే స్నేహితులిద్దరూ పట్టుబడ్డారు. తీరా విచారిస్తే తాశీల్దారు వారి పురాణం బయటపడి సి. ఐ. డి. ఏర్పాటయిందట! ఆతడు లేనప్పుడు డి. యస్. పి. సంతకంగలనోట్లు కొన్ని అక్కడ అతని యింట్లో పట్టుపడ్డాయట! ఆయన కని మా పూజారిస్తే ఇంకాకొన్ని విశ్వాస వర్గాలనుంచి ముత్యాలయ్యగారి చిరకాలపు మోసం తెలిసిపోయింది. పాపం! కలలోకూడా 'సాయి' వెనకవుండే దొంగసరకులు పట్టుబడ్డాయని తోడు దొంగలిద్దరూ అనుకోలా! సాయి అడ్డుపడ్డాడనుకున్నారు!... తాసీల్దారు వారిని నేస్తుడని ఆహ్వానిస్తే తనకే ముప్పు ఆహ్వానించినట్లయింది శెట్టిగారికి. సి ఐ.డి శాఖ వారు తర్వాత యీ తాసీల్దారే శెట్టిగారికి పర్మిషన్ ఇప్పించడం కనుక్కొని అదీ కేసు పెట్టారు. భక్తుల బండారం బయటపడింది.

---

సోదర సోదరీమణులారా!

# అధ్యక్షోపన్యాసం

ఓగేటి శివరామకృష్ణ

ఎవరో నాయకుని జన్మదినోత్సవ సందర్భంలో రాష్ట్రం అంతటా ఉత్సవాలు యేర్పాటు చేయబడ్డాయి. ప్రభుత్వం ఆదినం సెలవు దినంగా పరిగణించింది. 'కీచురాయి'లో ఉన్నత పాఠశాలా విద్యార్థులంతా కలసి యీ సమయంలో ఓ ఉత్సవం జరప నిర్ణయించుకొన్నారు. అన్నీ సిద్ధపరచబడినాయ్. బాగుందనుకొన్నారు అంతా. ఇంతకీ అధ్యక్షుడెవరు? అనే ప్రశ్న వచ్చేసరికి ఓపెద్ద ఉప్పెనవచ్చి పడ్డటయింది వాళ్లకు. విద్యార్థులు ఒకరిని కోరారు. ఉపాధ్యాయులొకర్ని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల దృష్టిలో మరొకరు కన్పించారు. మొత్తంమీద తీవ్రమైన చర్చమీద మూడు వర్గాలవారూ కలసి, తమ పట్టణంలోనే ఉంటున్న ఒక 'గొప్ప ఉపన్యాసకులు' అని పేరు సంపాదించుకొంటున్న ఆయన్ని అధ్యక్షులగా ఆహ్వానించ సంకల్పించారు. అనుకొనడమే తడవుగా వారి నాహ్వానించటం, (ఖాళీగా ఉండటంవల్ల) వెంటనే వారంగీకరించటం జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతావందనం యిస్తూ విషయం 'నాయకులగురించి మీ ఉన్నతాభిప్రాయాల'ని చెప్పారు. 'ఓ అల్లాగే' అన్నారు సభ కవబోయ్యే అధ్యక్షులు.

సరే బాగుంది. అనుకొన్న రోజు, రోజుతో పాటు ఉత్సవ కార్యక్రమం, వచ్చాయి. పాఠశాలా భవనంలోకి విద్యార్థులే కాక, విద్యార్థుల తల్లిదండ్రులూ, మరితర పెద్దలూకూడా, ఆహ్వానాలమీద వచ్చారు. అంతా నిశ్శబ్దంగా ఉంది.

ప్రార్థనానంతరం అధ్యక్షులవారిని సభవారికెరుకపరుస్తూ ప్రధానోపాధ్యాయులిలా గన్నారు. "నేడు మన నాయకుని జన్మదినోత్సవం